క్లుప్తంగా

పంచాయతీల సమస్యల పరిష్కారానికి కృషి



సి.బెళగల్ డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వరి

సి.బెళగల్: గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి అన్నారు. కర్నూలు జిల్లా పరిషత్‌లోని డీఆర్సీ నుంచి మండలానికి డిప్యూటీ ఎంపీడీఓగా నియమితులైన ఆమె శుక్రవారం ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల శుభ్రత, సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయం, ప్రజల సహకారంతో పనులను పక్కాగా చేపడతామన్నారు. నూతన డిప్యూటీ ఎంపీడీఓను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువులను సక్రమంగా విక్రయించాలి



ఎరువుల దుకాణాల డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఎరువుల దుకాణదారులు తమ వద్ద ఉన్న ఎరువుల నిల్వలను సక్రమంగా రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణ డీలర్లతో ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించి ఎరువుల క్రయ విక్రయాలపై చర్చించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని దుకాణాలు, రైతు సేవా కేంద్రాల్లో పుష్కలంగా ఎరువులు ఉన్నాయని, రైతులకు చెప్పాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు విక్రయించరాదన్నారు. ఎరువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను కచ్చితంగా కలిగిఉండాలని, అమ్మకాలపై ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఏఓ ఆదేశించారు. ఎరువుల క్రయవిక్రయాల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏఓ దుకాణదారులకు సూచించారు.

రైతులకు విత్తనాల పంపిణీ



సి.బెళగల్‌లో రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏఓ మల్లేశ్‌కుమార్

సి.బెళగల్: మండల రైతులకు కంది, జొన్న, మినుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏఓ మల్లేశ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మండలానికి 18 కంది విత్తన ప్యాకెట్లు, 12 జొన్న, 10 మినుముల విత్తనాల ప్యాకెట్లు మినీ కిట్లగా మంజూరయ్యాయని తెలియజేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు పంటలను సాగు చేయని రైతులు ఉచితంగా అందజేసే మినీకిట్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు పంట బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. వీఏఏ ప్రవీణ్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం, పసుపుల, ఉల్చాల గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో, మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు ఉన్నాయని, అవసరమైన రైతులు బస్తాకు రూ.266 చెల్లించి తీసుకెళ్లవచ్చని ఏఓ రూఫస్ రోనాల్డ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే లావు, సన్న యూరియాలో ఎలాంటి తేడాలుండవని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు.

జనాభా నిర్వహణపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ వేణుగోపాల్

కల్లూరు: యువతకు విద్యార్థి దశ నుంచే జనాభా పెరుగుదలపై అవగాహన ఉండాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పెద్దపాడు ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ ఈరన్నరావు, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- కస్తూర్బా, విద్యా అధికారులపై సభ్యుల మండిపాటు
- వైద్యులు, ఆర్‌అండ్‌బీ అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం
- గౌరవ వేతనం లేకుండా సభకు ఎలా రావాలని సభ్యుల ప్రశ్న



విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

సి.బెళగల్: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సభ్యుల ప్రశ్నలు, మండిపాటు, ఆగ్రహావేశాలు, అధికారుల సమాధానాలతో వాడీవేడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఆయా శాఖల మండల అధికారులు హాజరై మూడు నెలల కాలంలో చేపట్టిన పనులపై నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏఓ మల్లేష్‌కుమార్ పంటబీమా పథకం, కోడుమూరు డివిజన్ హార్టీకల్చర్ అధికారి మధుసుదన్‌గౌడ్ ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకాలను వివరించారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో పాటు హౌసింగ్, పీఆర్, ఇరిగేషన్ ఏఈలు మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు.

విద్యాశాఖ అధికారులపై మండిపాటు

ఎంఈఓలు జ్యోతి, ఆదాంబాషా మాట్లాడుతున్న సందర్భంలో విద్యాశాఖ అధికారుల తీరుపై సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంఈఓల పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, చదువు చెప్పకుండ సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. సి.బెళగల్ కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్లను కొనుగోలు చేయాల్సి వస్తోందని, సిబ్బంది విద్యార్థుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని, ఇనగండ్ల, సి.బెళగల్ ఎంపీటీసీ సభ్యులు తిమ్ములమ్మ, వీరన్నగౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంపీపీ సైతం వైద్యులు, ఆర్‌అండ్‌బీ అధికారుల గైర్హాజరుతో పాటు విద్యాధికారులు, కస్తూర్బా పాఠశాల వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రాణెమ్మ కలుగజేసుకుని పాఠశాలను తనిఖీ చేసి సమగ్ర విచారణ చేపడతామని చెప్పడంతో సభ్యులు శాంతించారు.

గౌరవ వేతనం ఇవ్వరా?

తమకు 18 నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయలేదని, ఇటు అభివృద్ధి పనులకు నిధులులేక, అటు కనీసం గౌరవ వేతనం లేకుండా సమావేశాలకు ఎలా రావాలని ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓను ప్రశ్నించారు. తమ సమస్యలపై వినతిపత్రం ఇస్తూ, గౌరవ వేతనం మంజూరు చేయకపోతే ఇకపై సమవేశాలకు, సభలకు రాలేమని తేల్చి చెప్పారు.

చెరువు, ప్రధాన రహదారి సమస్య పరిష్కరించాలి

సి.బెళగల్ చెరువు, గ్రామ ప్రధాన రహదారి సమస్యలపై స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, గ్రామ సర్పంచ్ పాండురంగన్న ప్రశ్నలు లేవనెత్తారు. చెరువులో, గట్టుపై జమ్ము భారీగా పెరిగిందని, జమ్ము గూగు పెద్ద ఎత్తున గ్రామంలోకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జమ్ము గూగు ఇళ్లలోకి చేరడంతో పాటు, ప్రయాణికుల కళ్లలోకి పడుతూ తీవ్ర అవస్థలు పడుతున్నారని, జమ్మును, ముళ్ల పొదలను తొలగించి కోరారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పలుకుదొడ్డి గ్రామ క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా రోడ్డును బాగుచేయాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓ (ఈఓఆర్డీ) మహేశ్వరి, డీటీ పురుషోత్తం, వైస్ ఎంపీపీలు తలారి బీసమ్మ, నాయకంటి మంగమ్మ, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారు



అమ్మవారిని కూరగాయలతో అలంకరించిన దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. ఆర్‌జీఎంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో విద్యార్థులకు గాయాలు కాగా శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్న

కర్నూలు (న్యూటౌన్): యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యామని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్‌ఐ జిల్లా మహాసభల్లో అయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో అత్యంత ఎక్కువ నిరుద్యోగం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ నిర్మాణం, రైల్వే వ్యాగన్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాషా, జిల్లా నాయకులు అంజి, షాహిన్, రఘువరన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



బి.తాండ్రపాడులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

కర్నూలు(రూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీలో రోజువారీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య కార్మికుల చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. చెత్త సేకరణలో ఎవైనా సమస్యలు ఉన్నాయా? గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఎలా నిర్వహిస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.రఘునాథ్, మండల పరిషత్ అధికారులు జేమ్స్ కృపావరం, గ్రామ పంచాయతీ సెక్రటరీ బి.గోపాల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని మానుకోవాలి



లొద్దిపల్లె కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను అమర్చే విధానాన్ని మానుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న కోరారు. శుక్రవారం పార్టీ బృందం సభ్యులు లొద్దిపల్లె, భైరాపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నివాసాలకు ట్రూఅప్‌చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్‌తో ఈనెల 14న స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టనున్నామన్నారు. ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాసూంబాషా, వ్య.క.స నాయకులు రామస్వామి, నాగరాజు, డప్పు కళాకారుల సంఘం నాయకులు కృష్ణుడు, మద్దిలేటి, నారాయణ పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై ఫిర్యాదు

కర్నూలు (సిటీ): ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ మహిళా ఉపాధ్యాయురాలు శుక్రవారం జిల్లా ప్రజా రవాణా రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. తాను గోనెగండ్ల మండలం ఎస్.లింగందిన్నె స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం కర్నూలు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులో కోడుమూరు వెళ్లి.. అక్కడ పత్తికొండ ఆర్డినరీ బస్సు ఎక్కి లింగందిన్నె స్టేజీకి టిక్కెట్ తీసుకుంటానని చెప్పారు. స్టేజీ వచ్చాక బస్సు నిలపాలని కోరడంతో.. ఏంటి మేడం రెండు కిలోమీటర్లు కూడా లేదు, ఇదింత ఆటోకు రావచ్చు కదా? రోజూ ఇలా సతాయిస్తారేంటని డ్రైవర్ ప్రయాణికుల ముందు అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తనను చూసి బస్సు ఆపకుండా వెళుతున్నారని, స్టేజీ కంటే ముందు గానీ లేకుంటే స్టేజీ దాటి 200 మీటర్ల దూరం వెళ్లాక బస్సును నిలుపుతున్నారని వాపోయారు. తనను అవమానించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు చెప్పారు.

13న స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఈత పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.రామకృష్ణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వెంట స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ప్రతిభ చాటిన స్విమ్మర్లు ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 10 వ అంతర్ జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఈత పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.



జి.సింగవరంలో ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు

జోరుగా ఉల్లి నాట్లు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని కేసీ కాలువ ఆయకట్టు, తుంగభద్ర నది తీరాన ఉన్న గ్రామాల్లో, బోరుబావుల కింద ఉల్లినాట్లు జోరుగా సాగుతున్నాయి. జి.సింగవరం, పడిదెంపాడు, నిడ్జూరు, ఆర్.కొంతలపాడు, ఆర్.కె.దుద్యాల,ఎదురూరు, పి.రుద్రవరం, సుంకేసుల, దేవమాడ, ఉల్చాల, రేమట, తదితర గ్రామాల్లో రైతులు ఉల్లి పంటను విత్తుతున్నారు. ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉల్లినాట్లువేస్తే రూ.400 ఇస్తున్నట్లు కూలీలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సుకుమార్ తెలిపారు. మండలంలోని ఐదు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. దీంతో కొత్తకోట, సి.బెళగల్, గుండ్రేవుల, పోలకల్, బురాన్‌దొడ్డి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని జి.సింగవరం, ఎన్‌హెచ్ -7, పంచాలింగాల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, సబ్ స్టేషన్ల మరమ్మతు పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్పార్‌బీసీ ఎస్‌ఈగా సుభకుమార్



ఎస్‌ఈ సుభకుమార్‌కు అభినందలు తెలుపుతున్న సిబ్బంది

పాణ్యం: ఎస్పార్‌బీసీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా సుభకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గోరుకల్లు ఈఈగా పనిచేసిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో అవుకు వెళ్లారు. పదోన్నతిలో భాగంగా ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.

పేద రైతుకు ఆర్థిక సాయం



కౌలుట్లయ్య కుటుంబానికి సాయం అందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, సుధాకరరావు

కర్నూలు(సెంట్రల్): గోనెగండ్లకు చెందిన బోయ కౌలుట్లయ్య అనే రైతు కాడెద్దులు లేకపోవడంతో తన ఇద్దరు మనువళ్లతో సేద్యం చేస్తున్న వీడియో జూన్ 21వ తేదీ నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ ఆస్పత్రి కంటి వైద్యుడు డాక్టర్ సుధాకరరావు ఆ వీడియోను చలించిపోయారు. బాధిత రైతును ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. కాడెద్దులు కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు సాయం చేయాలని నిర్ణయించాడు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా చేతుల మీదుగా సాయాన్ని రైతు బోయ కౌలుట్లయ్యకు అందించడంతో ఆయన సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సమస్యలు పట్టావా

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



రెమడూరు రైతులతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రైతుల ఇబ్బందులు పట్టావా అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెమడూరు గ్రామ పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని శుక్రవారం కాటసాని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. రెమడూరు నుంచి కె.నాగలాపురం వరకు వెళ్లే పొలాల రస్తా దారుణంగా ఉన్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆయన విమర్శించారు. ఎరువులు, మందులు, విత్తనాలు ఎడ్ల బండ్లపై తీసుకెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందలు పడుతున్నా పరిష్కరించాలనే ధ్యాస ప్రభుత్వానికి లేదన్నారు. జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పొలాల రస్తా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కర్రెన్న, రంగన్న, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతులు పొలాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి



పైపులైన్‌కు చిల్లులు పడడంతో రోడ్డుపై పారుతున్న నీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కర్నూలు కార్పొరేషన్‌లో చిల్లులు పడుతున్న పైపులైన్లను తొలగించి కొత్త పైపులు వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 36, 37, 41వ వార్డుల పరిధిలోని మెయిన్ రోడ్డులో ఉన్న ప్రధాన పైపులైన్‌కు చిల్లులు పడిన ప్రదేశాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు, జిల్లా కమిటీ సభ్యురాలు అలివేలమ్మ మాట్లాడుతూ.. వీకర్‌సెక్షన్ కాలనీ ప్రధాన పైపులైను నిత్యం ఏదో ఒకచోట చిల్లులు పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్ పాతది కావడంతో వాటి స్థానంలో కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం సమస్య వచ్చినప్పుడు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. పైపులైన్‌కు చిల్లులు పడడంతో మురుగు నీరు లోపలికి చేరి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే రోడ్డుపై నీళ్లు ప్రవహించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు ప్రభాకర్, భాస్కర్, రహిమాన్, జమన్న, హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్‌లో అదనపు బాధ్యతల కేటాయింపు



ఈఈ బి.విజయరాజును అభినందిస్తున్న డీఈఈలు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఆ శాఖలో పనిచేస్తున్న ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు శుక్రవారం ఆయా డివిజన్లలో బాధ్యతలు స్వీకరించారు. నాణ్యత నియంత్రణ విభాగంలో డీఈఈగా పనిచేస్తున్న బి.వి జయరాజు శ్రీశైలం వరద రక్షణ విభాగం ఈఈగా అదనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆ విభాగంలో పనిచేస్తున్న డీఈఈలు, ఏఈఈ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తరువాత ఇంజినీర్లతో విజయరాజు సమావేశం నిర్వహించి, డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులు, ఏవేవి తమ పరిధిలోకి వస్తాయో అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా 68 చెరువులకు నీటిని అందించే పనులు చివరి దశలో ఉన్నాయని, కాల్వకు నీరొచ్చిన తరువాత చెరవులకు పంపింగ్ చేసేందుకు సిద్ధమైనట్లు ఇంజినీర్లు వివరించారు. కర్నూలు నగరానికి గతంలో వచ్చిన వరదల సమయంలో నిర్మించాల్సిన రక్షణ గోడ, హంద్రీనది ఆక్రమణలు, సుద్దవాగు, వక్కెరవాగుల రక్షణ కోసం చేపట్టనున్న పనుల గురించి సమావేశంలో చర్చించారు. డీఈఈలు రామకృష్ణ, విజయ్‌కుమార్, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

- హంద్రీనీవా సుజల స్రవంతి పథకం డివిజన్-2 ఈఈగా అనంతపురం హెచ్చెల్సీ బత్తులపల్లిలో డీఈఈగా పని చేస్తున్న ఎన్.ప్రసాద్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు చర్యలు





మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): అక్షరాంధ్ర ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అక్షరాంధ్రపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నూరు శాతం అక్షరాస్యతను సాధించేందుకు అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు ఉన్న 1,61,914 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులుగా తయారు చేసేందుకు చర్యలు తీసుంటున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఉపాధి హామీ శాఖలు వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి వలంటీర్ ద్వారా 10 మందిని అక్షరాస్యులుగా తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 1 నుంచి వచ్చే మార్చి వరకు కొనసాగుతుందని, రోజుకు 2 గంటల పాటు నిరక్షరాస్యులచే అక్షరాభ్యాసం చేయించాలని సూచించారు. కర్నూలు జిల్లాలో 5,75,296 మంది నిరక్షరాస్యులను రాబోయే మూడేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. వయోజన విద్య డీడీ కె.చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీపీఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డిప్యూటీ డీఈఓ రాజేంద్ర ప్రసాదు పాల్గొన్నారు.